www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:25 THURSDAY ,JUNE 4,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 25 గురువారం 4 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

హంసకలం వార్త జూన్ 3

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామిక వేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని - మిగతా2లో



## వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి పెట్టాలి....




- రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా..
- ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి..
- ఖరీఫ్ సాగు ప్రణాళిక పై మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల..

## పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు.. చమురు ధరలకు రెక్కలు!

హంసకలం వార్త జూన్ 3


అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాలుస్తూనే ఉన్నాయి. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇటీవల క్షిపణి దాడులు జరగ్గా.. వాటికి తామే బాధ్యులమని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తాజాగా ప్రకటించింది. ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం పై ఇటీవల అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా ఈ చర్యలు - మిగతా2లో



## 12.5 శాతం సుంకం తప్పదన్న ట్రంప్.. స్పందించిన భారత్

హంసకలం వార్త జూన్ 3

సుంకాల విధింపు పై వెనక్కు తగ్గని డొనాల్డ్ ట్రంప్ మరో కొత్త అస్త్రాన్ని తెర పైకి తెచ్చారు. ఈసారి యూఎస్ ట్రేడ్ యాక్ట్ –1974 సెక్షన్ 301ను ప్రయోగించారు. కార్మికుల వెట్టి చాకిరీతో ఉత్పత్తి చేసే వస్తువుల - మిగతా2లో



## తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్: ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!




హంసకలం వార్త జూన్ 3

హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో - మిగతా2లో

## తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!




- భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్లు తెలిపిన మంత్రి పొంగులేటి

## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌ల పై సుప్రీం కోర్టు సంచలన తీర్పు



హంసకలం వార్త జూన్ 3

ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌ల పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా - మిగతా2లో

## రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి: అద్దంకి దయాకర్

హంసకలం వార్త జూన్ 3

మాజీ మంత్రి హరీష్‌రావుతో రాజకీయంగా ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో - మిగతా2లో



## పవన్ వ్యాఖ్యల పై కేటీఆర్ కౌంటర్.. ప్రాంతీయ వాదం పై రాజకీయ దుమారం

హంసకలం వార్త జూన్ 3 :

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన "ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదకరం" అనే వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్రంగా స్పందించారు. ప్రాంతీయ హక్కుల కోసం జరిగిన ఉద్యమాలను ప్రాంతీయవాదంగా - మిగతా2లో



# వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి పెట్టాలి

-మొదటిపేజీ తరువాయి

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్-అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధార పడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు.. చమురు ధరలకు రెక్కలు!

-మొదటిపేజీ తరువాయి

ఈ చర్యలు చేపట్టినట్లు టెహ్రాన్ పేర్కొంది. తమ వాయుసేన బలగాలు.. అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులతో దాడులు జరిపినట్టు ఐఆర్‌జీసీ వెల్లడించింది. తమ దేశంపై ఎలాంటి చర్యలకు దిగినా బలమైన ప్రతి దాడులుంటాయని ఇరాన్ సైన్యం వాషింగ్టన్‌ను హెచ్చరించింది. అయితే.. ఇరాన్ చేపట్టిన దాడులతో తమకు పెద్ద నష్టమేమీ జరగలేదని అమెరికా, కువైట్ దేశాలు తెలిపాయి. ఇరాన్ నుంచి దూసుకొస్తున్న క్షిపణులు, డ్రోన్‌లను తమ వాయుసేన అడ్డుకుందని కువైట్ పేర్కొంది. అలాగే.. ఇరాన్ క్షిపణుల్లో ఏ ఒక్కటీ తమను చేరలేదని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేసింది. మరోవైపు.. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఘర్షణలూ మరింత తీవ్రమయ్యాయి. దక్షిణ లెబనాన్‌లోని అల్-మర్వానియేపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇద్దరు పిల్లలు సహా ఆరుగురు మృతిచెందినట్టు సమాచారం. ప్రతిగా సరిహద్దు సమీపంలో హెజ్‌బొల్లా చేపట్టిన డ్రోన్ దాడిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు గాయపడ్డారు. కాగా.. ప్రపంచంలో ప్రధాన చమురు రవాణా మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధి.. ఈ సంక్షోభానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కొ రూబియో స్పందిస్తూ.. ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు టెహ్రాన్ అణు కార్యక్రమానికి సంబంధించినవి మాత్రమేనని, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి కాదన్నారు. మరోవైపు.. ఈ జలమార్గంలో సుదీర్ఘ అంతరాయంతో ప్రపంచ చమురు దిగుమతి వ్యయాలు 20 బిలియన్ డాలర్లకు పెరగొచ్చని, ఫలితంగా పేద దేశాలు మరింత నష్టపోతాయని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. గల్ఫ్‌లో పెరుగుతున్న అనిశ్చితి కారణంగా చమురు ధరలు మరోసారి ఎగబాకాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 97 డాలర్లకు పైగా పెరగగా, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరువైంది. ఈ ఉద్రిక్తతలు ఇంకా పెరిగితే ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముందని వ్యాపార రంగాలు ఆందోళన చెందుతున్నాయి.

# తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శక మైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి: అద్దంకి దయాకర్

-మొదటిపేజీ తరువాయి

హరీశ్‌రావుతో కేటీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, బీఆర్‌ఎస్‌లో నాయకత్వ సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు. పదవుల కోసం త్యాగాలు చేశానని చెప్పే కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడి హోదాకు రాజీనామా చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలను ఖండించిన ఆయన, భవిష్యత్తు లేని నాయకులకే ఫ్యూచర్ సిటీపై భయం పట్టుకుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టాప్-100 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంపై కేటీఆర్‌కు పూర్తి అవగాహన లేదని, అవసరమైతే దానిపై ప్రత్యేకంగా క్లాస్ చెబుతామని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకత్వంపై సొంత పార్టీ నేతలకే నమ్మకం లేదన్న అద్దంకి దయాకర్, ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని ప్రయత్నించ వద్దని ప్రతిపక్షాలకు అద్దంకి దయాకర్ సూచించారు.

## పవన్ వ్యాఖ్యల పై కేటీఆర్ కౌంటర్..ప్రాంతీయ వాదం పై రాజకీయ దుమారం

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని గుర్తుచేస్తూ,అది కూడా ప్రాంతీయవాదమేనా అని నిలదీశారు.అలాగే తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయనే విమర్శలను ప్రస్తావిస్తూ, ''జాతీయవాదం'' పేరుతో ఆర్థికంగా ఒక రాష్ట్రానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం సరైందేనా అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గుజరాత్‌కు అధిక ప్రాధాన్యం లభిస్తోందన్న ఆరోపణలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రధానిగానే వ్యవహరించాలా లేక ఒక రాష్ట్రానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలా అనే అంశంపై పవన్ కళ్యాణ్ సమాధానం ఇస్తారా అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి.ఒకవైపు ప్రాంతీయ హక్కులు,స్వాభిమాన ఉద్యమాలను సమర్థించే వర్గాలు కేటీఆర్ అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుండగా,మరోవైపు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల సందర్భాన్ని వక్రీకరించారని జనసేన శ్రేణులు వాదిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ప్రాంతీయత,జాతీయత,అభివృద్ధి, పెట్టుబడుల పంపిణీ వంటి అంశాలపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు.

## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## 12.5 శాతం సుంకం తప్పదన్న ట్రంప్.. స్పందించిన భారత్

-మొదటిపేజీ తరువాయి

కార్మికుల వెట్టి చాకిరీతో ఉత్పత్తి చేసే వస్తువుల దిగుమతులను అడ్డుకునే నిబంధనలను సరిగా అమలు చేయని దేశాల పై 12.5 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు సరిగా లేని 60 దేశాల (భారత్ సహా) నుంచి అమెరికాకు దిగుమతయ్యే వస్తువులపై 12.5 శాతం సుంకం విధిస్తామని చెప్పారు. ఈ పరిణామంపై భారత్ తాజాగా స్పందించింది. అమెరికాతో చర్చలు జరుపుతున్నామని చెప్పింది. సుంకాలతో పాటు ఇతర అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని భారత్ పేర్కొంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా జరుగుతున్నాయని చెప్పింది. ఈ మేరకు వాణిజ్య శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 7 నాటి సంయుక్త ప్రకటన ప్రకారం ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని చెప్పింది. ప్రభుత్వ వర్గాల ప్రకారం, సెక్షన్ 301 సుంకానికి సంబంధించి అమెరికా వాణిజ్య ప్రతినిధి ఇప్పటికే పలు దేశాల పరిస్థితులను పరిశీలించారు. అయితే, ఈ సెక్షన్ పరిధిలోని కొన్ని భారత ఉత్పత్తులపై ఇప్పటికే అమెరికా మరో చట్టంలోని సెక్షన్ 232 కింద సుంకం విధిస్తోంది. దీంతో, వీటిపై మరోసారి సుంకం విధించే అవకాశం ఉండదు. ఇక వస్త్ర పరిశ్రమకు సంబంధించి మినహాయింపుల కోసం మరో వ్యవస్థ ఏర్పాటుపై కూడా చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రతిపాదన ప్రకారం, అమెరికా దిగుమతి చేసుకునే వస్త్రాల్లో కొన్నింటిపై తక్కువ సుంకం విధించే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రతిపాదనపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ అంశాలపై సంబంధిత వ్యక్తులు, సంస్థలు తమ అభిప్రాయాలను జూన్ 22 వరకూ అమెరికాతో పంచుకునే అవకాశం ఉంది. అనంతరం అమెరికా వాణిజ్య ప్రతినిధి మరోసారి ఈ అంశాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.

## తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్: ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!

-మొదటిపేజీ తరువాయి

ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్ voters.eci.gov.in ను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు. తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.

## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌ల పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

-మొదటిపేజీ తరువాయి

దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.

# సంపాదకీయం

## ఇది 'అర్బన్ హీట్ ఐలాండ్' ప్రభావం

ప్రస్తుత వేసవి కాలంలో ఉత్తర భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు నమోదవుతున్నాయి. ఈ వేసవిలో దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత సుమారు 48 డిగ్రీలు ఉత్తరప్రదేశ్‌లోని 'బాండా' పట్టణంలో నమోదయింది. గతంలో మధ్యాహ్నం పూట ఎండ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు, ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండటం వల్ల వేడి నుంచి రక్షణగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. పగటి ఉష్ణోగ్రతల కంటే వేగంగా రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడమే దీనికి ప్రధాన కారణం. ఇరుకైన ఇళ్లు, సరైన గాలి-- వెలుతురు లేని గదులు, సరైన డిజైన్ లేని భవనాలు ఇంటి లోపలి వేడిని పెంచుతున్నాయి. రాత్రి సమయంలో శరీరం వేడి నుంచి కోలుకోవాలి. కానీ రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల నిద్ర, విశ్రాంతి సాధ్యం కాదు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు, మరణాలు సంభవిస్తాయి. గత 115 సంవత్సరాల్లో పగటి ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగాయి. కానీ ఇటీవలి సంవత్సరాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. ఇది పగలు-- రాత్రి మధ్య ఉష్ణోగ్రతల తేడాను తగ్గిస్తోంది. దేశంలోని వివిధ నగరాలలో పగటి ఉష్ణోగ్రతల కంటే రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రధాన సమస్యగా మారింది. దీనికి కారణం 'అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం'. అంటే నగరాలు, పట్టణ ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా ఉండటం. ఉదాహరణకు సౌత్ ఢిల్లీలోని పచ్చని ప్రాంతాలు చుట్టుపక్కల ప్రాంతాల కంటే 2-- 3 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత కారణంగా చల్లగా ఉంటాయి. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, బంజారాహిల్స్ ప్రాంతాలు చుట్టుపక్కల ప్రాంతాల కంటే ఎక్కువ వేడిగా ఉంటాయి. అదే నగరం బయటకు వెళ్తే ఉష్ణోగ్రతలు ఆకస్మికంగా తగ్గడం గమనించవచ్చు. కాంక్రీటు భవనాలు, రోడ్లు, గాజు, మెటల్ వంటివి పగటిపూట వేడిని గ్రహించి రాత్రి సమయంలో ఆ వేడిని విడుదల చేస్తాయి. ఎయిర్ కండీషనర్లు ఇంటి లోపల చల్లగా చేస్తాయి కానీ వాతావరణంలోకి వేడిని విడుదల చేస్తాయి. అందమైన రూపం కోసం కార్పొరేట్ ఆఫీసులలో గ్లాస్ ఫసాడ్స్‌ను అధికంగా వాడటం వల్ల పరిసరాల ఉష్ణోగ్రత కనీసం 7 డిగ్రీలు పెరుగుతుంది. హైదరాబాద్‌లో గాజు నిర్మాణాల కార్పొరేట్ ఆఫీసులు ఉన్న ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఎక్కువగా ఉంటాయి. శిలాజ ఇంధనాల వాహనాలు, ఫ్యాక్టరీలు... వేడి, కాలుష్యాన్ని పెంచుతాయి. ఎత్తైన భవనాలు గాలి ప్రవాహాన్ని అడ్డుకోవటం వల్ల వాతావరణంలో వేడి పెరుగుతుంది. చెట్లు, పార్కులు, తోటల సంఖ్య తగ్గిపోవటం కూడా మరో సమస్య. అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరం నిరంతరం వేడికి గురై డీహైడ్రేషన్, అలసట, హీట్ స్ట్రోక్, నిద్ర సమస్య, మరణాలు సంభవించవచ్చు. పేదలు, ఎయిర్ కండీషనర్ లేనివారు, ఇంట్లో గాలి-- వెలుతురు సరిగ్గా లేనివారు ఎక్కువ ప్రమాదంలో పడతారు. విద్యుత్ కొరత, నీటి కొరత, పంటల నష్టం జరుగుతుంది. ఎక్కువగా నీరు త్రాగడం, ఇంటిని చల్లగా ఉంచుకోవటం, పగలు వేడి ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకపోవటం, కాటన్ దుస్తులు ధరించటం, టోపీ లేదా గొడుగు ఉపయోగించటం, రాత్రి సమయంలో మంచి వెంటిలేషన్ ఏర్పాటు చేసుకోవటం ద్వారా వేడి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. అంతేకాకుండా ఎక్కువ చెట్లు నాటాలి. వృక్షాలు సహజసిద్ధమైన ఎయిర్ కండీషనర్స్‌గా పనిచేస్తాయి. వాతావరణం వేడెక్కినప్పుడు వృక్షాలు భూమిలోని నీటిని వేర్ల సాయంతో గ్రహించి, ఆకుల ద్వారా ఆ నీటిని వాతావరణంలోకి విడుదల చేస్తాయి. దీంతో వాతావరణం చల్లబడుతుంది. అలాగే కార్పొరేట్ ఆఫీసుల భవనాలలో గాజు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. గ్లాస్ వాడకం శీతల దేశాలకు అవసరం, భారతదేశం వంటి ఉష్ణమండల దేశాలకు శ్రేయస్కరం కాదు. భవనాలకు మెరుగైన వెంటిలేషన్ కల్పించుకోవాలి. చెరువుల వంటి నీటి వ్యవస్థలను కాపాడుకోవాలి. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకోవాలి. కూల్ రూఫ్ టెక్నాలజీని వినియోగించుకోవాలి... తద్వారా హీట్ ఐలాండ్ ప్రభావం నుంచి బయటపడవచ్చు. వాతావరణ మార్పు వల్ల ప్రపంచవ్యాప్తంగా సమస్యలు ఎదురవుతున్నాయి. మన దేశంలో ఈ సమస్యల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. భారతదేశంలో మంచు కరిగిపోవడం పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై చర్చకు దారితీస్తోంది. ఈ అంశాలన్నీ మానవాళికి ప్రకృతి పంపిస్తున్న హెచ్చరికలు. ఈ సమస్యలకు మానవ జీవన విధానాలే మూలకారణం. ఆ విధానాలను మార్చుకోవటం ద్వారా వాతావరణ, పర్యావరణ మార్పుల తీవ్రతను తగ్గించుకోవచ్చు.

# రాజకీయం సరే, ఆర్థికం మాటేమిటి




'ఆడుతూ ఉన్నప్పుడే మీరు గెలుస్తారు. మీరు ఆడకపోతే గెలుపెలా వస్తుంది?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల చిన్నపిల్లలతో మాట్లాడుతూ అన్నారు. 1987లో భారతీయ జనతా పార్టీలో చేరినప్పటి నుంచీ నరేంద్రమోదీ రాజకీయాల్లో ఆడుతూనే ఉన్నారు. వచ్చే ఏడాది ఈ రాజకీయ క్రీడలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకోనున్న మోదీకి ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ ఓటమి వాటిల్లలేదు. 1987లో బీజేపీ గుజరాత్ ప్రధాన కార్యదర్శిగా ఆయనకు అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బాధ్యతలు అప్పజెప్పినప్పుడు తొలిసారి తన పార్టీకి ఆ నగర పాలనా సంస్థను కైవసం చేయడంలో సఫలమయ్యారు. అప్పటి నుంచీ ఆయన వెనక్కు తిరిగి చూడనే లేదు. కార్పొరేషన్ గెలుపుతో గుజరాత్‌లో ప్రారంభమయిన ఆయన విజయ ప్రస్థానం రాష్ట్రంలో బీజేపీని అధికారంలో తెచ్చి, తర్వాత స్వయంగా తానే ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి, 12 సంవత్సరాలు తిరుగులేని పాలన చేపట్టేంతవరకూ సాగింది. అంతటితో ఆగకుండా మోదీ 2014లో ఏకంగా దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలోనూ నిరాఘాటంగా గత 12 సంవత్సరాలుగా ఆ అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారు. 1987లో మోదీ ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించేనాటికి కాంగ్రెస్ కేంద్రంలోనూ, 15 రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉండేది. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో గెలుపుతో మోదీ సారథ్యంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు 21 రాష్ట్రాల్లో అధికారం సాధించినట్లయింది. ఒక రకంగా మోదీ ఇప్పుడు రాజకీయ జీవితపు మహోన్నత దశలో ఉన్నారు. ఒకవైపు 12 సంవత్సరాల తన పాలన విజయోత్సవాలకు సన్నాహాలు చేస్తూనే మరోవైపు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ భారీ మార్పులకు ఆయన సిద్ధమవుతున్నారు. తన తదుపరి రాజకీయ క్రీడకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు. 'గెలుపు క్రీడ మాత్రమే కాదు, అది పులిపై స్వారీ చేయడం లాంటిది' కూడా అని రాజనీతిజ్ఞులు అభివర్ణిస్తుంటారు. ఒక్కసారి దానిపై నుంచి దిగితే అదే మనను స్వాహా చేస్తుంది. 'ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో విజయం సాధించడం మాత్రమే కాదు' అని అంబేద్కర్ ఎప్పుడో చెప్పారు. రాజకీయాల్లో మోదీ ప్రభుత్వానికి తిరుగు లేకపోయినా, భారత ఆర్థిక పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉన్నది. జీడీపీ పెరుగుదల క్రమంగా తగ్గుతోందని, సగటు ద్రవ్యోల్బణం రెట్టింపు అవుతోందని, అభివృద్ధి వేగం మందకొడిగా సాగుతోందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మే నెలలో ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించిన నెలవారీ సమీక్ష అంతర్జాతీయ పరిణామాలు భారతదేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేసింది. రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతోంది. క్రూడాయిల్ దిగుమతి బిల్లులు పెరుగుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మే 15 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయి. వరుసగా రెండో వారం భారత విదేశీమారక ద్రవ్య నిల్వలు పడిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం వంటి ఆర్థికవేత్తలు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని మే 2025లో నీతీ ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. కానీ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తాజాగా విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ అవుట్ లుక్ ప్రకారం భారతదేశం ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు పడిపోయింది. ఈ విషయం ఎలా ఉన్నప్పటికీ గణాంక వివరాలతో సంబంధం లేకుండా దేశంలో తలసరి ఆదాయం అతి తక్కువస్థాయిలో ఉన్నదని అందరికీ తెలుసు. 1991 నుంచి చైనాలో తలసరి ఆదాయం 38సార్లు పెరిగితే.. మన దేశంలో కేవలం 8సార్లే పెరిగిందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రధాని మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడమే పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్వల్పకాలిక చర్యలు తీసుకుంటోంది కానీ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలిక చర్యలు అంటే ఏమిటి? సంస్కరణలను మరింత వేగవంతం చేయడమా? విదేశీ పెట్టుబడులు మరింత స్వేచ్ఛగా ప్రవేశించేందుకు వీలు కల్పించడమా అన్న చర్చలు జరుగుతున్నాయి. మోదీ ఈ దిశగా ఏ చర్యలు తీసుకుంటున్నారో ఎవరికీ స్పష్టత లేదు. దేశ ఆర్థిక పరిస్థితిపై నీతీ ఆయోగ్ వంటి సంస్థలు కూడా పారదర్శకంగా నివేదికలు ప్రకటించడం లేదు. ఇలాంటి సంస్థలు అభివృద్ధిని గోరంతలు కొండంతలు చేసేందుకే తహతహలాడుతుంటాయి. ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితిని చెప్పేందుకు అవి ప్రయత్నించడం మానేసి చాలా కాలమైంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రుల తలలు మారిస్తే మాత్రం పరిస్థితి మెరుగవుతుందా? రెండవది, ఎన్నికల్లో విజయం సాధించలేకపోతోన్న ప్రతిపక్షాలు.. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్పించడంలో విజయవంతమయినట్లే కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ, ఐటీ, సీవీసీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి సంస్థల పనితీరుపై మాత్రమే కాదు, సుప్రీంకోర్టు ఇస్తున్న తీర్పులపై కూడా అనుమానం కలిగించేందుకు ఆస్కారం కలిగిస్తున్నాయి. విచిత్రమేమంటే ఎన్నికలు సవ్యంగా జరిగినా ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోంది. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఎడాపెడా ప్రయోగించడం వల్ల అవి నిజంగా పనిచేసినా వాటిపై నమ్మకం కలగడం లేదు. సుప్రీంకోర్టుకూ, ప్రభుత్వానికీ మధ్య ఉండాల్సిన హద్దులు చెరిగిపోతున్నాయా అన్న అనుమానం కలిగే విధంగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారు. చివరకు విద్యార్థులకు పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి ఈ దేశంలో నెలకొన్నదని నీట్ ప్రశ్నపత్రాలు మరోసారి లీక్ కావడంతో తేలింది. ఈ పరిస్థితులపై కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సోషల్ మీడియాలో ఇచ్చిన పిలుపునకు ఈ దేశ యువత కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిస్పందించిన తీరు ఎక్కడో నిప్పు రగులుతోందన్న భావనను కలిగిస్తోంది. సోషల్ మీడియా అకౌంట్లను నిలిపివేసినంత మాత్రాన ప్రశ్నలు వేసేవారు తగ్గిపోతారనుకోవడం అమాయకత్వం. అందువల్ల, ఎన్నికల్లో విజయం సాధించడమే కాదు, వ్యవస్థల విశ్వసనీయతను పెంచేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు యువత ప్రయత్నించినప్పుడే మోదీ సర్కార్ విజయం సాధించినట్లు భావించాల్సి ఉంటుంది. అంతేకాదు, బెంగాల్‌లో విజయంతో మోదీ సర్కార్ రాజకీయ విజయాలు పూర్తయినట్లు కాదు. వచ్చే ఏడాది నుంచి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మళ్లీ విజయం సాధించాల్సి ఉన్నది. ఇందులో ప్రధాని స్వంత రాష్ట్రం గుజరాత్‌తో పాటు, అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్, ఇంకా మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలున్నాయి. దక్షిణాదిన నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి అంత భవ్యంగా ఏమీ లేదు. కర్ణాటకలో యడ్యూరప్పకు అతీతంగా బీజేపీకి స్వంత అస్తిత్వమంటూ లేదు. దత్తాత్రేయ హోసబలె, సంతోష్, ముకుంద్ వంటి అగ్రశ్రేణి ఆరెస్సెస్ నాయకులు పలువురు కర్ణాటకకు చెందినవారే అయినా అక్కడ బీజేపీ స్థిరంగా నిలదొక్కుకోలేకపోతున్నది. ఇక తెలంగాణలో తానెక్కిన కొమ్మను తానే నరుక్కోవడంలో బీజేపీని మించిన పార్టీ కనపడడం లేదు. తమిళనాడులో నిన్న మొన్నటిదాకా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న అన్నామలై.. రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని ప్రకటించి తన దారి తాను చూసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బెంగాల్‌లో కంటే దక్షిణాదిలో ఆమోదయోగ్యత సాధించడం ముఖ్యమని బీజేపీ నేతలు గ్రహించినట్లు కనపడడం లేదు. మోదీ బలహీనతలు ఏమైనప్పటికీ వాటిని ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ ఎంతవరకు ప్రయత్నిస్తున్నదనేది చర్చనీయాంశం. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బీజేపీని ముఖాముఖి ఢీకొనేందుకు కాంగ్రెస్ ఏమి చేస్తున్నదో ఎవరూ చెప్పలేరు. కేరళలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత ముఖ్యమంత్రిని నిర్ణయించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం 11 రోజుల సమయం తీసుకున్నది. అక్కడి ప్రజలు, పార్టీ సీనియర్లు, కేడర్ పూర్తిగా సతీశన్‌ను అభిమానిస్తున్నారని తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీకి ఇన్ని రోజులు పట్టింది. తన కుడిభుజంగా ఉన్న కేసీ వేణుగోపాల్ తానే ముఖ్యమంత్రి అయ్యేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నప్పటికీ ఆయన వారించలేకపోయారు. అంతేకాదు, కేరళలో గెలిచామన్న సంతోషం లేకుండా ఢిల్లీకి కర్ణాటక తలనొప్పి ప్రారంభమైంది. అక్కడ సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య సర్దుబాటు చేయలేని దుస్థితిలో ఢిల్లీ పెద్దలు ఇద్దర్నీ తమ వెంట తిప్పుకున్నారు. అల్పసంఖ్యాకులు, వెనుకబడిన వర్గాలు, దళితులతో కూడిన అహిందా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దరామయ్య ఒకవైపు, పార్టీకి ఎంతో విధేయంగా ఉంటూ ప్రతి సంక్షోభంలో జాతీయ నాయకత్వానికి చేదోడు వాదోడుగా ఉన్న డీకే ఒకవైపు అధిష్ఠానాన్ని దిక్కుతోచని పరిస్థితిలో పడేశారు. నిజానికి ఒకప్పుడు అహ్మద్ పటేల్‌ను గెలిపించడం కోసం గుజరాత్ ఎమ్మెల్యేలను బెంగళూరు తరలించిన డీకే పలు కేసుల్లో చిక్కుకున్నారు. చివరకు ఆయన తీహార్ జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. అలాంటి డీకేకు ముఖ్యమంత్రి ఇవ్వడం సబబే కానీ, తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటానని, రాజ్యసభకు రానని స్పష్టం చేసిన సిద్దరామయ్య భవిష్యత్ కార్యాచరణ గురించి ఇప్పుడే చెప్పలేం. శివకుమార్ తన మంత్రివర్గంలో సిద్దరామయ్య చెప్పినవారందర్నీ చేర్చుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. గత 20 రోజులుగా తొలుత కేరళ నేతలు, ఇప్పుడు కర్ణాటక నేతలతో ఏఐసీసీ, ఢిల్లీ హోటళ్లు కిటకిటలాడిపోతున్నాయి. కాంగ్రెస్‌లో వర్గ పోరు ప్రతి రాష్ట్రంలో ఉన్నా ఢిల్లీ అధిష్ఠానం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. బీజేపీలో ఆ పరిస్థితి ఎప్పుడూ లేదు. 17 రాష్ట్రాల్లో బీజేపీ ముఖ్యమంత్రులున్నా, ఏ ఒక్కరూ మంత్రివర్గ విస్తరణ కోసం, ఇతర మార్పులకోసం ఢిల్లీకి వచ్చిన దాఖలాలు లేవు. వారు రానక్కర లేకుండానే ఎవర్ని నియమించాలో నిర్దేశించగలిగిన పట్టు బీజేపీ పెద్దలకు ఉన్నది. అది బీజేపీకి, కాంగ్రెస్‌కు ఉన్న తేడా. వాటి జయాపజయాల వెనుక రహస్యం కూడా అదే.

# తెలంగాణపై మాటల యుద్ధం

-పవన్ తెలంగాణ ప్రేమ రాజకీయ నాటకం : గడ్డం వంశీకృష్ణ..
-తేజస్వి సూర్య వ్యాఖ్యలపై మౌనం ఎందుకు?..
-పొత్తులు ఒకచోట.. తెలంగాణ ప్రేమ మరోచోట..
-తెలంగాణను కాపాడేది కాంగ్రెస్ పార్టీయే..

హంస కలం వార్త జూన్ 3 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

తెలంగాణకు న్యాయం చేస్తామని, తెలంగాణ కోసం గొంతెత్తుతామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలపై పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తీవ్ర స్థాయిలో స్పందించారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రజల త్యాగాలను, అమరవీరుల ఆకాంక్షలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం ఎవరూ చేయొద్దని హెచ్చరించారు. తెలంగాణను అవమానించిన సందర్భాల్లో మౌనం పాటించిన వారు, ఇప్పుడు తెలంగాణ రక్షకులుగా మాట్లాడటం ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకమేనని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం చేసిన రోజుల్లో పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో వేలాది మంది యువకులు జైళ్ల పాలవుతుంటే, వందలాది మంది ప్రాణత్యాగాలు చేస్తుంటే తెలంగాణ ప్రజల పక్షాన ఒక్క మాటైనా మాట్లాడారా అని నిలదీశారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లు, బాధలు, ఆవేదనలు కనిపించని వారికి ఇప్పుడు తెలంగాణపై ప్రేమ పుట్టడం ఆశ్చర్యకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించే వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సందర్భాల్లో కూడా పవన్ కళ్యాణ్ స్పందించలేదని గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చిన తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. తెలంగాణ యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడినప్పుడు మౌనం వహించిన వారు, ఇప్పుడు తెలంగాణ హక్కుల కోసం పోరాడతామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన శక్తులతోనే రాజకీయంగా చేతులు కలిపి, తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచిన వారితోనే కలిసి నడుస్తూ, ఇప్పుడు తెలంగాణకు మద్దతు ఇస్తామనడం కపట రాజకీయాలకు పరాకాష్ట అని గడ్డం వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటల్లో తెలంగాణ ప్రేమను చూపిస్తూ, చేతల్లో తెలంగాణకు అన్యాయం చేసిన వారిని సమర్థించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక కాంగ్రెస్ పార్టీ పోరాటం, త్యాగం, రాజకీయ సంకల్పం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు చేసిన ఉద్యమానికి అండగా నిలబడి, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ఆమోదింపజేసి రాష్ట్రాన్ని సాధించిందీ కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిలిచిన శక్తులు ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడటం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు రాజకీయ అవకాశవాదాన్ని బాగా గుర్తిస్తారని,



ఎన్నికల సమయంలో మాత్రమే తెలంగాణ పేరు గుర్తుకొచ్చే నాయకులను నమ్మే పరిస్థితి లేదని గడ్డం వంశీకృష్ణ అన్నారు. పదవులు, రాజకీయ లాభాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తెలంగాణ పేరును ఉపయోగించుకునే వారి అసలు స్వరూపాన్ని ప్రజలు ఇప్పటికే అర్థం చేసుకున్నారని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకునే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కులు, యువత భవిష్యత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రాజీపడదని గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల తరఫున పోరాడుతూ, తెలంగాణ గౌరవాన్ని కాపాడేందుకు ముందుండి పనిచేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజల త్యాగాలతో ఏర్పడిన ఈ రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీయాలనుకునే వారిని ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ కోసం నిజంగా పోరాడిన వారిని, తెలంగాణ పేరును కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న వారిని ప్రజలు బాగా గుర్తించగలరని గడ్డం వంశీకృష్ణ అన్నారు.

# జర్మనీ చూపు తెలంగాణపై

-జర్మనీతో తెలంగాణకు భారీ భాగస్వామ్యం..
-యువతకు అంతర్జాతీయ ఉద్యోగాల దారి..
-సెమీకండక్టర్ పెట్టుబడులకు తెలంగాణపై ఫోకస్..
-తెలంగాణ రైజింగ్-2047'కు జర్మనీ ప్రశంసల జల్లు..

హంస కలం వార్త జూన్ 3 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

తెలంగాణ అభివృద్ధికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. జర్మనీలోని తురింగియా రాష్ట్రంతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, నవీన ఆవిష్కరణ సంస్థలు, జీవ విజ్ఞాన రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందం జరిగింది. తురింగియా ముఖ్యమంత్రి మారియో వోయిట్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ నిర్వహణ సంచాలకుడు శశాంక, తురింగియా రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ టైచార్ట్, సకెర్ట్, జర్మన్ కాన్సుల్ జనరల్ హాస్పర్ పాల్గొన్నారు. తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారియో వోయిట్ అభివర్ణించారు.





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ రైజింగ్--2047 దూరదృష్టి ప్రణాళికను ప్రశంసించారు. తెలంగాణతో భాగస్వామ్యం తమకు గౌరవమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధ ప్రభావంతో ప్రపంచ ఉపాధి రంగం వేగంగా మారుతోందన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. యువ భారత నైపుణ్య విశ్వవిద్యాలయం, ఆధునిక సాంకేతిక కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో శిక్షణ విధానాల అభివృద్ధికి తురింగియా సహకారం కోరారు. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సిద్ధంగా ఉన్నాయని మారియో వోయిట్ హామీ ఇచ్చారు. జర్మన్ భాషా శిక్షణ విస్తరణకు కూడా సహకరిస్తామని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రేవంత్ రెడ్డి వివరించారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి సంస్థలను తెలంగాణకు ఆకర్షించడమే లక్ష్యమని చెప్పారు. సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ సంస్థల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తురింగియా ప్రతినిధులు వెల్లడించారు. దీనిని స్వాగతించిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ సెమీకండక్టర్ సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ విదేశీ ఉపాధి సంస్థ ద్వారా జర్మన్ భాషా శిక్షణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఆధునిక సాంకేతిక కేంద్రాల్లో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నట్లు వివరించారు. పెట్టుబడులు, సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాల తలుపులు తెరవనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ అవకాశాలను అందించే కీలక అడుగుగా నిలవనుంది..

# రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ ,డిడిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీం మరియు అగ్నిమాపక శాఖలతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసిన

-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్
-వరదలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదురుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలి..

హంసకలంవార్త జూన్ 3

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్‌డీఆర్ఎఫ్, డిడిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీం మరియు అగ్నిమాపక శాఖలతో కోఆర్డినేషన్ మీటింగ్ బుధవారం నాడు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి, అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ముందస్తు చర్యలుగా రక్షక బృందాలను ముంపుకు గురయ్యే ప్రాంతాల సమీపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్, ఎస్‌డీఆర్ఎఫ్ , డిడిఆర్ఎఫ్ సింగరేణి రెస్క్యూ టీం మరియు అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, రోప్స్, చెట్లను తొలగించడానికి కావలసిన కట్టర్లను ఇతర





రక్షణ సామాగ్రిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీక్షల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలుగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ క్రాంతి కుమార్, టీజీఎస్పి అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్,ఆపరేషన్ ఆర్ఐ బి. రవి, సింగరేణి రెస్క్యూ టీం ఇంచార్జ్ అనంత రాములు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు సుమంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే సర్కార్ లక్ష్యం ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

హంసకలంవార్త జూన్ 3

మహిళలు స్వయంచాలకంగా ఎదిగేందుకు.. అండగా రాష్ట్ర ప్రభుత్వం పత్యేక దృష్టి సారించడమే కాకుండా కోటిమంది మహిళమనులను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళు న్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో మెప్మా సౌజన్యంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా డివిజన్ నంబర్ 3 గూపన్ పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను నిర్వాహకులు, స్థానిక నాయలు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సంబంధిత అధికారులు మహిళా సంక్షేమార్థం తమ శాఖ ద్వార చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చీరల పంపిణీ చేపట్టారు . ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు స్వతంత్రంగా తమ కాళ్ల పై తాము నిలబడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే వడ్డీలేని ఋణాలు, వ్యాపార నిమిత్తం స్త్రీనిధి ఋణాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళామణులు స్వయంగా తయారుచేసిన వస్తువులకు మార్కెటింగ్ కల్పిస్తూ.. శిల్పారంలో ప్రత్యేకకంగా స్టాళ్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇక గూపన్ పల్లి అభివృద్ధికి పార్టీలకి అతీతంగా తనవంతు కృషి ఎల్లపుడు ఉంటుందని తెలిపారు. తనకు కూడా ఇక్కడి నుండే ఓటుహక్కు ఉందని గుర్తుచేశారు.

-పవన్ కల్యాణ్ మాటల్లో అహంకారం కనిపిస్తోంది

పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యల పై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తెలంగాణ ఏమైనా పాకిస్తాన్ లో ఉందా అన్న పవన్ కళ్యాణ్ మాటల్లో అహంకారం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రతి పౌరుడుకి దేశంలో ఎక్కడైనా తిరిగే స్వేచ్ఛ ఉందని .. పవన్ కళ్యాణ్ ఎక్కడ తిర్గినా.. ఎక్కడి నుండి పోటీ చేసిన తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ తెలంగాణ పట్ల అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోన్ నివసిస్తున్నారు.. అలాంటిది తెలంగాణపై మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, ఉమ్మాజి నరేష్, హన్మండ్లు, తరుణ్, అంబర్ సింగ్, స్థానిక కార్పొరేటర్ ప్రసూన, మెప్మా డీఎంసీ మాధురి లత, టీఎంసీ శోభారాణి, స్త్రీనిధి ఆర్ ఎం రాందాస్,మేనేజర్ సుగుణ, సి ఓ అర్చన స్త్రీనిధి, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష

-అధికారులకు దిశానిర్దేశం చేసిన అదనపు కలెక్టర్లు

హంసకలంవార్త జూన్ 3



ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10వ తేదీలలో పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసిల్దార్లు, ఎం.పీ.ఓలు, వివిధ శాఖల అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు గ్రామ, వార్డు సభల నిర్వహణకు సంబంధించి పాటించాల్సిన విధి, విధానాలు, ప్రస్తావించాల్సిన అంశాలు, ప్రజలకు విశదపర్చాల్సిన విషయాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం గురించి అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు దిశానిర్దేశం చేశారు. గ్రామ, వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. సభ నిర్వహణకు ఒకరోజు ముందే టాంటాం ద్వారా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తుగానే సమాచారం తెలియజేయాలని తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ గురించి సభలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఈ కార్యక్రమానికి సహకరించాల్సిందిగా కోరాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ అమలులో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర క్రియాశీలకం అయినందున రాజకీయ పార్టీలు సత్వరమే బీ.ఎల్.ఏలను నియమించుకుని నిర్దేశిత నమూనాలో జాబితాను సమర్పించేలా ప్రజాప్రతినిధులను కోరాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటల మార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేయాలని, వర్షపు నీటి నిలువ, పొదుపుగా సాగు జలాల వినియోగం, అవసరం మేరకే ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించాలని హితవు పలికారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, ప్రకృతి సమతుల్యత కోసం అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. అనుకోని రీతిలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆపదమిత్ర వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవడం, ఎవరికైనా విపత్తుల వల్ల నష్టం సంభవిస్తే ఆయా పథకాల ద్వారా ప్రభుత్వాలు అందించే నష్టపరిహారం గురించి సభలలో తెలియజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తడి,పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై ప్రజల్లో అవగాహనను పెంపొందించాలని, వాల్టా, వన్యప్రాణి సంరక్షణ చట్టాల గురించి తెలియజేయాలని సూచించారు. రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, సానిటేషన్ వంటి వాటి కోసం ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరిస్తూ, వారి నుండి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరిస్తూ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములయ్యేలా చూడాలని, రహ్ వీర్ వంటి పథకాల గురించి వారికి విశదపర్చాలని అన్నారు. ఆపద్బంధు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వంటి వాటిని అర్హులైన వారి సద్వినియోగం చేసుకునేలా ఆయా పథకాల గురించి అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం గురించి, రెండవ విడత ఇళ్ళ మంజూరీ ప్రక్రియ గురించి సభలలో వివరించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, గ్రామ, వార్డు సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, డీ.ఎఫ్.ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్ లోడింగ్ లో వేగం పెంచాలి

**-ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

హంసకలంవార్త జూన్ 3



అపరెల్ పార్క్,రైస్ మిల్లులు, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ,అపరెల్ పార్క్,రైస్ మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేయడం, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసివేశారు. తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ,మెప్మా, రవాణా,తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ఉన్న బస్తాలను వెంటనే అపరెల్ పార్క్,రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ఇంకా అవసరమైన గన్ని సంచులు ముందస్తుగా తెప్పించాలని, రైస్ మిల్లుల నుంచి తీసుకోవాలని సూచించారు.కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు,హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. కొనుగోళ్లు వేగంగా చేపట్టి మూడు రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.

# స్వచ్ఛ గావ్ సురక్షిత జలవాయు ప్రచార ప్రత్యేక కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

హంసకలంవార్త జూన్ 3



ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమాలను పెద్దపల్లి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జూన్ 5వ తేదీ వరకు నిర్వహించాల్సిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, సుస్థిర జీవనశైలిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల జిల్లా కలెక్టర్ వివరించారు. జూన్ 3న గ్రామంలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను (BWG) గుర్తించి, వారి జాబితాను తయారు చేయడం, జూన్ 4న అవగాహన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, సామాజిక భాగస్వామ్యంతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం. ఇందులో మిషన్ లైఫ్, SBM(+) 2.0 అంశాలపై అవగాహన కల్పించడం, ?జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్రత్యేక గ్రామ సభ' నిర్వహించడం. ఈ సభలో SWM నియమాలు, వ్యర్థాల నిర్వహణ, సాధించిన పురోగతిపై చర్చించి, వివరాలను MoPR పోర్టల్‌లో నమోదు చేయడం, మిషన్ లైఫ్" థీమ్ ద్వారా వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, బిసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పైసలు పంచితేనో?లాబీలు చేస్తేనో? తెలంగాణ రాలేదు

**-పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించిన గద్దర్ కూతురు వెన్నెల**
**-నిన్న మీడియాతో గద్దర్ పై పవన్ కీలక వ్యాఖ్యలు**

హంసకలంవార్త జూన్ 3




జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను గద్దర్ కూతురు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల ఖండించారు. తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరు ఈ రోజు మా జాగీరు రేపు మా బిడ్డల జాగీరు అన్నారు. పైసలు పంచితేనో, లాబీలు చేస్తేనో తెలంగాణ రాలేదని త్యాగాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమం ఆత్మ గౌరవ పోరాటం అని ఉద్యమంలో ప్రాణాలు తీసుకున్నామే తప్ప ఎవర్ని ఒక్క మాట కూడా అనలేదన్నారు. తెలంగాణ అన్నందుకు చాలా మందిని ఎన్కౌంటర్ చేశారని, ఉద్యమంలో చాలా మంది తల్లులు తమ బిడ్డల్ని కోల్పోయారన్నారు. నటుడిగా, గద్దర్ అభిమానిగా పవన్?ను అభిమానిస్తారని హాట్ కామెంట్స్ చేశారు.నిన్న మీడియాతో గద్దర్ పై పవన్ కీలక వ్యాఖ్యలు నిన్న హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్ గద్దర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. గద్దర్ ఓ సారి తన వద్దకు వచ్చి తన వెన్నులో బుల్లెట్లు దిగిన కారణంగా ఎక్కడికైనా ప్రయాణాలు చేసేందుకు ఇబ్బందిగా ఉందని తనను అడిగితే రెండు మూడు రోజుల్లో కారు కొని ఇచ్చానన్నారు. ఇవాళ నన్ను విమర్శిస్తున్న వారంతా గద్దర్ అన్న బతికుండగా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గద్దర్ అన్న విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుకుంటామని అది నా వ్యక్తిగత విషయం అని పవన్ చెప్పారు. గద్దర్ అన్నపై నాకున్న ప్రేమ, గౌరవాన్ని తప్పకుండా చూపిస్తాని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

హంసకలంవార్త జూన్ 3

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డుసభలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ విసి హాల్ నుండి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ,వార్డు సభల నిర్వహణ, ఏర్పాట్లు,జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు,సంక్షేమ పథకాల అమలుపై ఆయన జిల్లా,మండల స్థాయి అధికారులతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలన-ప్రగతి ప్రణాలికలో భాగంగా రేపటి నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టిన 'గ్రామసభల'ను అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలని,రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలన్నారు.అదేవిధంగా జనగణన,భూభారతి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.అలాగే, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ టైమ్ మెంబర్‌షిప్ తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రాబోయే వర్షాలు, వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు.విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, విరిగిన విద్యుత్ స్తంభాలను, వేలాడుతున్న ప్రమాదకర విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి,పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా బడిబాట' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ గూగుల్ మీట్ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు,జడ్పీ సీఈఓ





రవి,డీఆర్డీఓ రవీందర్,ఆర్డీఓ జగదీశ్వర్ రావు,డీపీఓ రమేష్,మున్సిపల్ కమిషనర్,విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు,జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి,తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమ రక్షకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**-తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

హంసకలంవార్త జూన్ 3

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయమంలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ నుండి మంచిర్యాల జిల్లా లో వికలాంగుల కి ట్రై మోటారైజడ్ స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్ళు,ల్యాప్టాప్ లు,5 జీ స్మార్ట్ ఫోన్లు,బిజినెస్ ఎంపవర్ కార్ట్స్ ఇతర ఉపకరణాలు ను ప్రభుత్వం సలహా దారులు హర్కర వేణుగోపాల్,ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్,కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్,కలెక్టర్ కుమార్ దీపక్ తో కలసి తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావుఫ్ ఖాన్ అధ్యక్షతన పంచడం జరిగింది, తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రిగా దివ్యాంగుల పెద్దన్న, వికలాంగుల సంక్షేమ అభివృద్ధి ప్రధాత రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రి అడ్డూరి లక్ష్మణ్,శాఖ అధికారుల సహకారంతో దివ్యాంగుల సంక్షేమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు.కోర్టు ఉద్యోగాలు లో 4 శాతం రిజర్వేషన్, ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్, నిరుద్యోగులు కోసం జాబ్ పోటల్ ఏర్పాటు చేసి వందల మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు దివ్యాంగులు దివ్యాంగులను పెండ్లి చేసుకుంటే కల్యాణ లక్ష్మి తో పాటు అదనంగా 2 లక్షలు రూపాయల ప్రోత్సాహకం దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను పున ప్రారంభించి ఈరోజున 11 వేల దివ్యాంగుల సంఘాలు ఏర్పడటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులను ప్రోత్సహించి దాదాపు 80 వేల మంది పొదుపు చేసుకునేలా ఆర్థికంగా ఎదిగే దిశగా నడిపించడం దివ్యాంగుల కార్పొరేషన్ లో పనిచేసే దివ్యాంగ ఉద్యోగులకి 2010 పిఆర్ సీ,2015 పిఆర్ సీ, 2020 పి ఆర్ సీ అమలు దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు 40 శాతం వైకల్యానికి ట్రై మోటారైజడ్ స్కూటీలతో పాటు బ్యాటరీ ట్రై సైకిళ్ళు,ఇన్నోవేటివ్ బ్యాటరీవీల్ చైర్లు,బ్యాటరీ వీల్ చైర్లు,బిజినెస్ ఏంపవర్ కార్ట్స్,బిజినెస్ ఆటోస్,అంధ విద్యార్థుల కొరకు హై ఎండ్, లో ఎండ్ ల్యాప్ టాప్ లు,ట్యాబ్ లు,ఉన్నత విద్య అభ్యసిస్తున్న శారీరక దివ్యాంగులకు అమలు చేయడం,బధిరుల కోసం 5+ స్మార్ట్ ఫోన్లు,వినికిడి యంత్రాలు,చేతి కర్రలు, సంక కర్రల పంపిణీ కొరకు ప్రత్యేక శిబిరాలు సహాయ ఉపకరణాలకు సంబందించి గత ప్రభుత్వంలో ఉన్న నిబంధనలు 20కి పైగా తొలగించి సులభతరం రాష్ట్ర వ్యాప్తంగా 1000 మందికి పైగా కిరాణం షాప్ నడుపుకునే వారు, టైలరింగ్ చేసే వారు, ఫోటో గ్రాఫర్ గా ఇలా అనేక వృత్తులు చేసుకునే వారు లబ్ది పొందారు.మహిళ సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ సహాయంతో శాఖ ప్రధాన కార్యాలయంలో 16 మంది దివ్యాంగ అమ్మాయిలకు ఉపాధి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 80 మందికి పైగా ఔట్ సోర్సింగ్ విధానంలో కనీస భృతి లేక ఇబ్బంది పడుతున్న వారికి ఉద్యోగాలు 6 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న దివ్యాంగులకు శస్త్ర చికిత్సలు చేసి సాధారణ వ్యక్తులుగా మార్చడం కోసం బాల భరోసా కార్యక్రమం పోలీస్ అడ్మిని స్ట్రేటివ్ & టెక్నీకల్ ఉద్యోగాలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్, ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం రిజర్వేషన్ ద్వారా వేల మంది దివ్యాంగులకు సొంత వాహనాలు రాజీవ్ యువ వికాసంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రితో



మాట్లాడి షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ లో షెడ్యూల్డ్ కులాల దివ్యాంగులు,షెడ్యూల్డ్ తెగల కార్పొరేషన్ లో షెడ్యూల్డ్ తెగల దివ్యాంగులకు 5% శాతం రిజర్వేషన్ వికలాంగుల ఉద్యోగులు రెండు దశబ్దాలుగా చేస్తున్న నిరీక్షణకి ముగింపు పలుకుతూ ఉన్న చోటనే/అతి దగ్గరలో పదోన్నతి పొందేలా& 70 శాతం పైన దివ్యాంగత్వం ఉన్న దివ్యాం గులకు బదిలీలు లేకుండా జి.ఓ.నం. 34 అమలు చేయడం ప్రపంచ, వికలాంగుల దినోత్వం రోజున ఓ.డిసౌకర్యం కల్పించేలా జీ.ఓసంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న దివ్యాంగులను సకలాంగులు పెండ్లి చేసుకున్నప్పుడు ఇచ్చే ప్రోత్సాహకం అందజేత 1981నుండి ఎన్నడూ లేని విదంగా దివ్యాంగుల కార్పొరేషన్ లో నెలలో 1వ బుధవారం ఒ 3వ బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ దివ్యాంగుల కొరకు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిపారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జీవన్ జి దీప్తి (పారా ఓలింపిక్ బ్రాంజ్ మెడల్)కి స్టార్ట్ సహకారం తో 1 కోటి రూపాయల నగదు, గ్రూప్ 2 ఉద్యోగం,500 గజాలు స్థలం ఇప్పించడం, స్పోర్ట్స్ పాలసీ ఏర్పాటు, రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గం,అధికార యంత్రాంగం,స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అనేక పథకాలు అమలు చేస్తూ దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనతో వట్టెం రిజర్వాయర్ వద్ద ఏర్పాట్లు పూర్తి

**-ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**
**-వనపర్తి,నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీలు**

హంసకలంవార్త జూన్ 3

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్ పంప్‌హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి లు సంయుక్తంగా ఏర్పాట్లను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని కుమ్మెర గ్రామ సమీపంలో ఉన్న వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్, పంప్‌హౌస్ ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 5 న సందర్శించనున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్ ,డెలివరీ సిస్టర్న్స్,ఎం జి కె ఎల్ ఐ లిఫ్ట్ -1 పంప్ హౌస్ పరిశీలించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్ , హెడ్ రెగ్యులేటరీ, ప్యాకేజ్ 3 కెనాల్ పనులు, ఏదుల రిజర్వాయర్ పంప్ హౌస్ పనులను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మెర చేరుకుంటారు. వట్టెం రిజర్వాయర్ కి సంబంధించి ప్యాకేజీ 8 ,9, 10,11 పనులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై కుమ్మెర గెస్ట్ హౌస్ వద్ద సమీక్ష నిర్వహించారు.ముఖ్యమంత్రి రాక



కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి, అక్కడి భద్రతా ప్రమాణాలు, వాహనాల పార్కింగ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ,ఎస్ పి తో పాటు సి ఎం భద్రతా అధికారులు పలు సూచనలు చేశారు.అనంతరం వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి ఎం పర్యటనకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గాలు, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ తరఫున పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీలు, ప్రవేశ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి కూడా భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్ తరాల మనుగడ సాధ్యం






**-ఆస్తుల కంటే స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరే నిజమైన వారసత్వం**

**-తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

హంసకలంవార్త జూన్ 3

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలోని 149 డిగ్రీ కళాశాలలను పర్యావరణహిత సుస్థిర అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ మరియు కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో సస్టైనబుల్ ఎన్విరాన్మెంట్ ఇన్షిట్యూట్స్ కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాదులోని బేగంపేట్ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్ ) ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభించారు. ప్రకృతి మనుషులతో పాటు సమస్త జీవరాశికి భగవంతుడు ప్రసాదించిన గొప్ప వరమని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. జీవజాల మనుగడకు మూలాధారమైన ప్రకృతిని సంరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ప్రపంచ పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరిస్తూ మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, నీటి వనరుల క్షీణత కారణంగా భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రకృతి సంపదలను పరిరక్షించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, నీటి వనరులను కాపాడడం వంటి చర్యలను ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలని సూచించారు.మన పిల్లలకు, భావితరాలకు కోట్ల రూపాయల ఆస్తులను కాకుండా స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పచ్చని వాతావరణాన్ని అందించడం ద్వారానే నిజమైన వారసత్వాన్ని అందించిన వారమవుతామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను అందరూ స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని, భూమిపై ప్రతి జీవి మనుగడ సాగించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెంపొందించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వృథాను అరికట్టడం ద్వారా ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి జీవికి అవసరమైన పరిశుభ్రమైన నీరు, స్వచ్ఛమైన గాలి అందేలా చూడటం మనందరి సామాజిక బాధ్యత అని స్పీకర్ పేర్కొన్నారు. ప్రకృతిని పరిరక్షిస్తూ పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలమని ఈ సందర్భంగా తన పుట్టిన రోజు నాడు 3 మొక్కలు నాటుతానని ఆయన తెలియచేశారు అనంతరం జ+= సంస్థ ముద్రించించిన పుస్తకావిష్కరణ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత, ప్రొఫెసర్ కే. పురుషోత్తం రెడ్డి, కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డిఎస్ఆర్ రాజేందర్ సింగ్, సి జి ఆర్ పర్యావరణ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి, వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, మాజీ సమాచార హక్కు చట్టం కమిషనర్ దిలీప్ రెడ్డి, ప్రఖ్యాత పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ నక్క సాయి భాస్కర్ రెడ్డి గారు, ప్రముఖ పాలసీ అనలిస్ట్ డాక్టర్ దొంతి నరసింహ రెడ్డి, శ్రీ మోహన్ గురుస్వామి ప్రముఖ ఆర్థికవేత, జి ఎస్ ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ హరి సర్వోత్తమన్, మరియు ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ డి ప్రియా కుమారి, డాక్టర్ వసంత లక్ష్మి, డాక్టర్ ఎన్ జగన్, డాక్టర్ అన్నీ షరాన్, కళాశాలలా ప్రిన్సిపల్స్, ఎకో క్లబ్ ఇంచార్జులు, సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడండి

**-సర్పంచులు, కార్యదర్శులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హితవు**



హంసకలంవార్త జూన్ 3

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హితవు పలికారు.బుధవారం మానకొండూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలను పరిమితం చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తాగు లేదన్నారు. పంచాయతీల అభివృద్ధి సర్పంచుల లక్ష్యం కావాలన్నారు. సర్పంచులు ఏ పార్టీ వారైనప్పటికీ అభివృద్ధి విషయంలో తన వద్దకు వస్తే తప్పకుండా తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి విస్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రజాప్రతినిధులపై ఆశలు పెట్టుకుంటారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ కవ్వంపల్లి కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, క్లోరినేషన్, రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఆయన కోరారు. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, గ్రామ సభలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి వీవీ వరలక్ష్మి, మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావుతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

# వ్యవసాయం నుంచి త్రాగునీటి వరకు ప్రతి రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరం

హంసకలం వార్త జూన్ 3

వ్యవసాయం నుంచి త్రాగునీటి వరకు ప్రతి రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖరీఫ్-2026 వ్యవసాయ ప్రణాళిక, ఖమ్మం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్-2026 సీజన్ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అన్ని ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం నుంచే రైతు వేదికల ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలు, ఇతర సాగు ప్రాంతాలను గుర్తించి రైతులకు తగిన ప్రత్యామ్నాయ పంటలను సూచించాలని తెలిపారు. వర్షపాతం పరిస్థితులపై నిరంతరం రైతులకు సమాచారం అందించాలని, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా యూరియా లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, ఇతర ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పచ్చిరొట్టే విత్తనాల సబ్సిడీ నిజమైన రైతులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట కోత అనంతరం వరి కొయ్యలు, పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంటూ, అధికారుల సూచనలను పట్టించుకోకుండా పొలాల్లో నిప్పు పెట్టిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు విస్తృత అవగాహన కల్పించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పునఃసమీక్షించాలని, స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని రైతు వేదికల ద్వారా ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగులో దేశంలో అగ్రస్థానంలో ఉందని, ఖమ్మం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మరో మూడు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా తెలంగాణను మరింత ముందంజలో నిలిపేందుకు అధికారులు, రైతులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఉద్యాన పంటల విస్తరణేనని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగును ఎంత విస్తీర్ణంలో చేపట్టినా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఎలాంటి పరిమితి లేదని స్పష్టం చేశారు.జిల్లాలో త్రాగునీటి సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ సమాచారం ఆధారంగా నాగార్జునసాగర్కు నీటి లభ్యతపై అంచనాలు వేసుకుంటూ ఖరీఫ్ కాలువల నిర్వహణపై వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాలువలలో ఉన్న బ్రిచ్లు, మరమ్మతు పనులు, నిర్వహణ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని జూలూరుపాడు టన్నెల్ పనులను ప్రాధాన్యతతో చేపట్టడంతో పాటు అవసరమైన అటవీ అనుమతులు పొందాలని సూచించారు. సత్తుపల్లి పట్టణంలో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్కు నీటి వనరు ఉందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటి వనరు లేకపోతే ప్లాంట్ వినియోగంపై ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నగర సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రజల అంగీకారం ఉన్న ప్రాంతాల్లో నగర అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనులను వేగవంతం చేయాలని సూచించారు. నగరంలోని డివైడర్లపై అందమైన మొక్కలు నాటేందుకు అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల, ఖమ్మం నగర పరిధిలోని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. మిగిలిన పనులకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఒక్క గుడిసె కూడా మిగలకుండా చూడాలని, మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మంజూరు పొందినప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన పేద కుటుంబాలకు అవకాశం కల్పించాలని సూచించారు. రెండవ దశలో అత్యంత పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని, చివరి దశలో ఉన్న మెడికల్ కళాశాల హాస్టల్ భవనాలను వెంటనే పూర్తి చేసి వినియోగానికి అప్పగించాలని సూచించారు. ఖమ్మం మార్కెట్ అభివృద్ధికి ప్రతిపాదించిన పనులను వేగవంతం చేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాలుగు లైన్ల రోడ్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కొత్తగా ప్రారంభమైన ఆసుపత్రులలో సేవలను మరింత విస్తరించాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిగా సోలార్ విద్యుత్ వాడే విధంగా ఏర్పాట్లు చేయాలని, కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. శిల్పారామానికి అవసరమైన అదనపు భూసేకరణ పనులు చేపట్టాలని, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు అత్యధికంగా పేద ప్రజలు నివసించే ప్రాంతమని, జూన్ నెల చివరి నాటికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు కుడి, ఎడమ వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి గ్యాప్ లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్-2026 వ్యవసాయ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా వివిధ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నా మని తెలిపారు. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, యూరియా వృథా కాకుండా అవసరమైన పరిమాణంలో మాత్రమే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



హంసకలం వార్త జూన్ 3 :

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలంలోని ఓం రైస్ మిల్, బెజ్జాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, అన్నపూర్ణ రైస్ మిల్, కిష్టాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, సుముఖ గోదాం లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకు నేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ మ్యాచ్‌కే కాకుండా టోర్నీ హైప్ తీసుకురండి: మంధాన




స్పోర్ట్స్ డెస్క్

మరికొన్ని రోజుల్లో మహిళల టీ20 ప్రపంచ కప్2026 సంగ్రామం జరగనుంది. జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో జూన్ 14న బర్మింగ్‌హామ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌పై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో టీమిండియా వుమెన్స్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అభిమానులు, మీడియాకు కీలక విజ్ఞప్తి చేసింది. కేవలం భారత్, పాక్ మ్యాచ్‌కే హైప్ క్రియేట్ చేయొద్దని, ఈ ప్రపంచ కప్ మొత్తానికి ఆదరణ దక్కేలా ప్రచారం చేయాలని కోరింది.భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడవ టీ20ఐ అనంతరం జరిగిన పోస్ట్ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మంధాన మాట్లాడారు. ' కామన్వెల్త్ గేమ్స్ 2022లో భాగంగా బర్మింగ్‌హామ్ వేదికగా భారత్, పాక్ తలపడ్డాయి. ఆ మ్యాచ్ టిక్కెట్లన్నీ వేగంగా అమ్ముడయ్యాయి. కేవలం భారత్-పాకిస్థాన్ మ్యాచ్ గురించే కాకుండా ఈ టీ20 ప్రపంచ కప్‌నకు కూడా ప్రచారం కల్పించాలని ఆశిస్తున్నాను. కేవలం ఒక మ్యాచ్‌కే మనం ప్రచారం కల్పించాల్సిన అవసరం లేదు. దానికి ఇప్పటికే చాలా ప్రచారం జరిగింది. చాలా మంది క్రికెట్ ప్రియులు ముందుకు వచ్చి మాకు మద్దతు ఇస్తారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. వారి కోసం మేం మంచి ప్రదర్శన ఇవ్వగలమనే నమ్మకం ఉంది" అని మంధాన పేర్కొంది. టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్-ఎలో ఉన్న భారత్.. లీగ్ దశలో తొలి మ్యాచ్ పాకిస్థాన్‌తో ఆడనుంది. 17న నెదర్లాండ్స్, 21న దక్షిణాఫ్రికా, 25న బంగ్లాదేశ్, 28న ఆస్ట్రేలియాతో టీమిండియా తలపడనుంది. ఇక, భారత జట్టు విషయానికొస్తే.. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో చేజార్చుకుంది. అంతకుముందు, టీమిండియా దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4-1 తేడాతో ఓటమి చవిచూసింది.

# భారత టీ20 కోచ్ రేసులో ఆశిష్ నెహ్రా!




ఇంటర్నెట్ డెస్క్:


ఐపీఎల్ 2026 ముగిసింది. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టు అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌కు సిద్ధమవుతోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమిండియా.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజయవంతంగా దూసుకెళుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. 2027 వన్డే ప్రపంచ కప్‌నకు కూడా భారత్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో గంభీర్ తర్వాత టీ20 కోచ్ రేసులో ఎవరున్నారనే విషయంపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్‌కు కోచ్‌గా ఉన్న ఆశిష్ నెహ్రా సరైన వ్యక్తి అని అభిప్రాయపడ్డాడు.ఆశిష్ నెహ్రా పూర్తిగా క్రికెట్‌పై దృష్టి పెట్టే వ్యక్తి. జట్టులోని సమస్యలను స్పష్టంగా అర్థం చేసుకుని పరిష్కరించగలడు. జట్టును గెలిపించడం కోసం పరితపి స్తుంటాడు. ఇతరులను సంతోషపెట్టేందుకు రాజకీయాలు చేయడు. ఇదే విషయాన్ని ప్లేయర్లు కూడా గమనిస్తారు. అతడి నేతృత్వంలో జట్టు విజయం సాధించినా.. ఆ క్రెడిట్ ఎంతమాత్రం తీసుకోవడానికి ఇష్టపడడు. సాధారణ వ్యక్తిలా తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతాడు. భవిష్యత్తులో భారత టీ20 కోచ్ కోసం వెతకాల్సి వస్తే.. ఆశిష్ నెహ్రా అత్యుత్తమ ఎంపిక అవుతాడు. అతడి రికార్డు అద్భుతం. నెహ్రా జట్టులోకి వస్తే బౌలింగ్ కోచ్‌గా కాదు.. నేరుగా హెడ్ కోచ్‌గానే రావాలి. వేర్వేరు కెప్టెన్లతో జట్టును విజయవంతంగా నడిపించిన వ్యక్తికి అదే సరైన స్థానం' అని సంజయ్ మంజ్రేకర్ వెల్లడించాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ప్రధాన కోచ్‌గా ఉన్న నెహ్రా.. జట్టును విజయ వంతంగా నడిపిస్తున్నాడు. 2022లో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన గుజరాత్ టైటాన్స్ ఒకసారి ఛాంపియన్‌గా నిలవగా.. మరో రెండు సార్లు ఫైనల్‌కు చేరింది. మరోసారి ప్లే ఆఫ్స్ ఆడింది. ఈ విజయాల వెనుక నెహ్రా కీలక పాత్ర పోషించాడు.




# ఎస్‌ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్.. ప్యాట్ కమిన్స్ సంచలన నిర్ణయం

స్పోర్ట్స్ డెస్క్:

ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ చక్కటి ప్రదర్శన చేసింది. ఎలిమినేటర్ మ్యాచ్ లో రాజస్థాన్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో తదుపరి సీజన్ కోసం తమ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం ప్రారంభించింది. అయితే ఈ లోపే ఎస్‌ఆర్ హెచ్ జట్టుకు భారీ షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. ఆ జట్టు కెప్టెన్, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027 సీజన్ నుంచి తప్పుకునే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపి స్తున్నాయి. ఈ విషయమై కమిన్స్ స్వయంగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఓ అంతర్జాతీయ మీడియాతో ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ.. 'వచ్చే ఏడాది నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది నా దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే నేనే ఏ విషయాన్ని ధ్రువీకరించలేను, ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాల బారిన పడవచ్చు' అని కమిన్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కమిన్స్ చేసిన ఈ వ్యాఖ్యలపై క్రికెట్ నిపుణులు పలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు 2027 అత్యంత కీలకం




కానుంది.ఆ ఏడాది ఆస్ట్రేలియా జట్టు ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. దేశం తరఫున ఈ పెద్ద టోర్నమెంట్లన్నింటికీ అందుబాటులో ఉండటం కోసం ఐపీఎల్ 2027కు దూరం కావాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆ ఉద్దేశంతోనే పై వ్యాఖ్యలు చేశాడని క్రీడా నిపుణులు అంటున్నారు.

# ఆల్కెమ్ నుంచి సెమాగ్లుటైడ్ సింగిల్ షాట్ సిరంజీలు




న్యూఢిల్లీ:

ఆల్కెమ్ లేబొరేటరీస్ భారత మార్కెట్లోకి సెమాగ్లుటైడ్ ఔషధాన్ని సింగిల్ షాట్ ప్రీ-ఫిల్డ్ సిరంజీల రూపంలో విడుదల చేసింది. వీటి ప్రారంభ ధర రూ. 350గా ఉంది. మధుమేహం నియంత్రణ, బరువు తగ్గడానికి వాడే ఈ ఔషధాన్ని ఈ రూపంలో దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన మొదటి కంపెనీగా ఆల్కెమ్ నిలిచింది. రెడీ టూ యూజ్, సింగిల్ షాట్ ప్రీ-ఫిల్డ్ సిరంజీల ఫార్మాట్‌ను రోగులకు సులభంగా అందుబాటులో ఉండేలా రూపొందించినట్టు పేర్కొంది. సెమాగ్లుటైడ్ వయల్స్‌కు సంబంధించి కూడా రెగ్యులేటరీ అనుమతిని ఆల్కెమ్ పొందింది. త్వరలోనే ఇవి కూడా మార్కెట్లోకి రానున్నాయి.

# భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు.. 900 పాయింట్లకు పైగా సెన్సెక్స్ పతనం




మే 3

పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా మధ్య ముదిరిన యుద్ధ ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను భారీగా దెబ్బతీశాయి. ఈ (బుధవారం) ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుంచే మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం గం. 10.50 సమయానికి సెన్సెక్స్ 851 పాయింట్లు పతనమై, 73,803 వద్ద ట్రేడవుతోంది. ఇదే సమయానికి నిఫ్టీ 243 పాయింట్లు కోల్పోయి, 23,240 వద్ద కదలాడుతోంది. మార్కెట్లోని దాదాపు అన్ని రంగాలు రెడ్ మార్క్‌లోనే ట్రేడ్ అవుతుండటం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచింది.కువైట్‌లోని యూఎస్ మిలిటరీ బేస్‌లపై ఇరాన్ నేరుగా క్షిపణి దాడులు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. ఇన్నాళ్లూ ఇరు దేశాల మధ్య చర్చలు సఫలమవుతాయని భావించిన మార్కెట్లకు ఈ తాజా దాడులు గట్టి షాకిచ్చాయి. యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉందన్న భయాలు గ్లోబల్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్బ్యారెల్‌కు 0.88శాతం పెరిగి 96.84 డాలర్లకు చేరింది.

**-ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు:**

ఈరోజు మార్కెట్ పతనానికి ఐటీ రంగానికి చెందిన దిగ్గజ షేర్లు ప్రధాన కారణమయ్యాయి. ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఏకంగా 6.65శాతం కుప్పకూలగా, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 5.16శాతం నష్టపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి పెద్ద షేర్లలో అమ్మకాల ఒత్తిడి నిఫ్టీని కిందకు లాగింది.ఈ భారీ పతనంలోనూ కాంకర్డ్ బయోటెక్ 7.83శాతం, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 5శాతం, ఎన్‌హెచ్‌పీసీ4.47శాతం లాభాలతో ట్రేడ్ అవుతూ మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి. ఇక, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.70గా ఉంది.



# 'స్పిరిట్' సెట్స్ నుంచి ప్రభాస్ ఫొటో షేర్ చేసిన స్టైలిస్ట్.. ఇంటర్నెట్‌లో రచ్చ!

-స్పిరిట్' సెట్స్ నుంచి ప్రభాస్ కొత్త లుక్ వైరల్
-స్టైలిష్ బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన డార్లింగ్
-ఫొటో షేర్ చేసి, ఆపై డిలీట్ చేసిన హెయిర్‌స్టైలిస్ట్
-ఫోటోతో ఫ్యాన్స్‌లో జోష్
-ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ డిమాండ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'స్పిరిట్' సెట్స్ నుంచి ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఓ ఫోటో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉండగా, ఈ ఫోటో వాటిని మరింత పెంచింది. వివరాల్లోకి వెళితే, 'స్పిరిట్' చిత్ర బృందంలోని హెయిర్‌స్టైలిస్ట్ ఒకరు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రభాస్ ఫోటోను షేర్ చేశారు. ఇందులో ప్రభాస్ ఎంతో స్టైలిష్‌గా బ్లాక్ డ్రెస్‌లో కనిపించారు. అయితే, పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఆ ఫోటోను డిలీట్ చేశారు. కానీ అప్పటికే ఆ ఫోటో స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిజానికి ఈ ఫోటో మే 26న తీసిందని తెలిసినప్పటికీ, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఈ కొత్త లుక్‌పై ఫ్యాన్స్ నుంచి భారీ స్పందన వస్తోంది. తమ హీరోను కొత్త అవతార్‌లో చూసి మురిసిపోతూ, వెంటనే సినిమా నుంచి అధికారిక ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 'స్పిరిట్' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని విమల్ థియేటర్, బాలానగర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఈ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సరసన తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ ప్రధాన విలన్‌గా కనిపించనున్నారు. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎస్ జే సూర్య 'కిల్లర్' మూవీ సెట్‌లో అగ్నిప్రమాదం-ఒకరి మృతి




ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు ఎస్ జే సూర్య స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న 'కిల్లర్' సినిమా సెట్‌లో నేడు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చెన్నైలోని బిన్నీ మిల్స్ ప్రాంతంలో జరుగుతున్న చిత్రీకరణలో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో చిత్ర పరిశ్రమలో కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. 'కిల్లర్' సినిమాకు సంబంధించిన ఓ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సెట్‌లో ఉన్న ఓ సిలిండర్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. ఈ పేలుడు ధాటికి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ ఒకరు మరణించినట్లు చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. ఈ అనూహ్య ఘటనతో చిత్ర బృందం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ప్రమాదం నేపథ్యంలో సినిమా షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

## ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్న రాఘవ లారెన్స్ కూతురు




కొరియోగ్రాఫర్, హీరో, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా మల్టీ టాలెంట్ చాటుకున్న రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన-4', లోకేష్ కనగరాజ్ 'బెంజ్', ప్రతిష్ఠాత్మక 'కాలభైరవ' చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే, లారెన్స్ కుటుంబం నుంచి మరో వ్యక్తి సినీ రంగప్రవేశం చేయబోతుండటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. లారెన్స్ కూతురు రాఘవి ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతోంది. అయితే, చాలా మంది స్టార్ల పిల్లల్లాగా హీరోయిన్‌గా కాకుండా.. లారెన్స్ కూతురు రాఘవి ఏకంగా దర్శకురాలిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతుండటం విశేషం. రాఘవికి చిన్నప్పటి నుండే సినిమా మేకింగ్ పట్ల ఆసక్తి ఉంది. దీంతో, ఆమె అమెరికా వెళ్లి డైరెక్షన్ టెక్నాలజీలో ప్రొఫెషనల్ కోర్సు పూర్తి చేసింది. సాధారణంగా ఎవరైనా దర్శకులు కావాలంటే పెద్ద డైరెక్టర్ల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసి అనుభవం సంపాదిస్తారు. కానీ రాఘవి మాత్రం ఎలాంటి ముందస్తు ఎక్స్‌పీరియన్స్ లేకుండా, నేరుగా మెగాఫోన్ పట్టేందుకు సిద్ధమై భారీ రిస్క్ తీసుకోబోతోంది. కూతురి నిర్ణయానికి లారెన్స్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఈ మొదటి సినిమాను తన సొంత డబ్బులతోనే నిర్మించడానికి కథను కూడా సిద్ధం చేశారు. ఇప్పటికే తన తమ్ముడు ఎల్విన్ లారెన్స్‌ను హీరోగా సపోర్ట్ చేస్తున్న లారెన్స్, ఇప్పుడు కూతురిని కూడా డైరెక్టర్‌గా పరిచయం చేస్తూ తన ఫ్యామిలీ నుంచి కొత్త టాలెంట్‌ను పరిశ్రమకు అందిస్తున్నారు.

# ఎవరీ శిల్పా షిండే... పురుషుల హక్కుల ఎన్జీవో ఎందుకు మండిపడుతోంది?

-నిర్మాతపై పదేళ్ల క్రితం అబద్ధపు లైంగిక వేధింపుల కేసు పెట్టానని వెల్లడి
-ఆ సమయంలో కాంట్రాక్ట్ చెల్లింపుల కోసం గత్యంతరం లేకే అలా చేశానని వెల్లడి
-తప్పుడు కేసు పెట్టిన శిల్పాను అరెస్ట్ చేయాలని పురుషుల హక్కుల సంఘం డిమాండ్
-'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్ సమయంలో వివాదం

ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం ఒక నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసును పెట్టానని ఆమె స్వయంగా ఒప్పుకోవడంతో వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలో తప్పుడు కేసు నమోదు చేసినందుకు ఆమెను తక్షణమే అరెస్ట్ చేయాలని పురుషుల హక్కుల ఎన్జీవో డిమాండ్ చేస్తోంది. వివరాల్లోకి వెళితే, 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్‌తో ప్రసిద్ధి చెందిన శిల్పా షిండే, ఇటీవల కమెడియన్ భారతీ సింగ్, హర్ష్ లింబాచియా హోస్ట్ చేసిన ఒక పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లీపై తాను తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టానని అంగీకరించారు. "కాంట్రాక్ట్ వివాదాలు, చెల్లింపులలో జాప్యం కారణంగా నాకు వేరే మార్గం కనిపించలేదు. అందుకే ఆ కేసు పెట్టాను. అది అబద్ధం అని మొదటిసారి ఒప్పుకుంటున్నాను" అని ఆమె తెలిపారు. రావాల్సిన డబ్బులు అందాక కోర్టు బయటే కేసును పరిష్కరించుకున్నామని వివరించారు. శిల్పా షిండే ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే, ఢిల్లీకి చెందిన 'ఎన్సీఎంఇండియా కౌన్సిల్ ఫర్ మెన్ అఫైర్స్' అనే పురుషుల హక్కుల సంస్థ స్పందించింది. "డియర్ ముంబై పోలీస్, నిర్మాతపై తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినందుకు శిల్పా షిండేను దయచేసి అరెస్ట్ చేయండి అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. నిజమైన బాధితులను రక్షించే చట్టాలను ఇలా దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాలని వారు కోరుతున్నారు. ఈ వ్యాఖ్యలపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆమెను విమర్శిస్తుండగా, నటి బెబికా ధుర్వే వంటి వారు నిజం చెప్పినందుకు ధైర్యవంతురాలని ప్రశంసించారు. ప్రస్తుతం శిల్పా,



నిర్మాత కోహ్లీ కుటుంబంతో సత్సంబంధాలనే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# రణ్‌వీర్ సింగ్ వివాదం.. వెనక్కి తగ్గిన ఫిల్మ్ ఫెడరేషన్

-రణ్‌వీర్ సింగ్‌పై జారీ చేసిన సహాయ నిరాకరణ ఉత్తర్వులు ఉపసంహరణ
-సీఐఎన్‌టీఏఏ, ఐఎంపీఏఏ విజ్ఞప్తితో నిర్ణయం మార్చుకున్నట్లు తెలిపిన ఎఫ్‌డబ్ల్యూఐసీఈ
-చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని రణ్‌వీర్‌కు ఆహ్వానం
-చివరి నిమిషంలో ప్రాజెక్టుల నుంచి తప్పుకోవడంపై ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆందోళన
-రణ్‌వీర్ పంపిన లీగల్ నోటీసుకు చట్టపరంగా సమాధానమిస్తామన్న ఫెడరేషన్

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు, ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ)కు మధ్య నడుస్తున్న వివాదం కీలక మలుపు తిరిగింది. రణ్‌వీర్‌పై జారీ చేసిన సహాయ నిరాకరణ ఉత్తర్వులను ఉపసంహరిం చుకుంటున్నట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నేడు అధికారికంగా ప్రకటించింది. సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (సీఐఎన్‌టీఏఏ), ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐఎంపీఏఏ) చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. ఈ ప్రకటనకు ఒకరోజు ముందే రణ్‌వీర్ సింగ్.. ఫెడరేషన్‌కు లీగల్ నోటీసు పంపడం గమనార్హం.ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్ అశోక్ పండిట్ మాట్లాడుతూ.. రణ్‌వీర్ పంపిన లీగల్ నోటీసు తమకు అందిందని, దానికి తమ న్యాయ బృందం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. "ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనేందుకు రణ్‌వీర్‌ను చర్చలకు ఆహ్వానిస్తున్నాం. ఆయన స్టార్‌డమ్‌ను మేం గౌరవిస్తాం. ఎవరినీ నిషేధించే అధికారం మాకు లేదు. రణ్‌వీర్ నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు.వివాదం నేపథ్యమిదే! ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో తెరకెక్కాల్సిన 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ సింగ్ చివరి నిమిషంలో తప్పుకోవడమే ఈ వివాదానికి అసలు కారణం. గత ఏడాది డిసెంబర్‌లో 'ధురంధర్' సినిమా విడుదలైన తర్వాత ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దీంతో మే 25న ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ఆయనపై సహాయ నిరాకరణ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యను పలువురు సినీ ప్రముఖులు తప్పుబట్టారు.ఈ నేపథ్యంలో ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా కూడా తీవ్రంగా స్పందించింది. నటీనటులు, టెక్నీషియన్లు చివరి నిమిషంలో ప్రాజెక్టుల నుంచి తప్పుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని, దీనివల్ల నిర్మాతలకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. 'డాన్ 3'తో ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్, 'దృశ్యం 3' నుంచి అక్షయ్ ఖన్నా వైదొలగడంతో పనోరమా స్టూడియోస్ నష్టపోయిన విషయాన్ని ప్రస్తావించింది. ఇలాంటి చర్యలు పరిశ్రమలో నమ్మకాన్ని, వృత్తి నైపుణ్యాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. మరోవైపు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చర్యను సవాలు చేస్తూ ప్రముఖ నిర్మాత, ఐఎంపీఏఏ మాజీ అధ్యక్షుడు టీపీ అగర్వాల్ కోర్టును



ఆశ్రయించారు. ఏ వ్యక్తిని లేదా సంస్థను బహిష్కరించే అధికారం ఏ ట్రేడ్ బాడీకి లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కూడా తమ న్యాయ బృందం స్పందిస్తుందని అశోక్ పండిట్ తెలిపారు. మొత్తంగా, సహాయ నిరాకరణ ఉత్తర్వులు వెనక్కి తీసుకున్నప్పటికీ, ఈ వివాదం చుట్టూ న్యాయపరమైన, పరిశ్రమపరమైన చర్చలు కొనసాగుతున్నాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449